



కదిరి చైర్‌పర్సన్‌కు

పదవీగండం తప్పదా..?

◆ త్వరలో అవిశ్వాస తీర్మానం అంటూ ప్రచారాలు
◆ మారుతున్న వైసిపి కౌన్సిలర్ల స్వరం
◆ టిడిపిలో చేరేందుకు మంతనాలు
◆ ఎమ్మెల్యే కందికుంట గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-కదిరి టౌన్


కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ కుర్చీకి పదవీ గండం తప్పదనే ప్రచారం జోరుగా నడుస్తోంది. చైర్‌పర్సన్ పరికి నజీమున్నిసాపై అవిశ్వాసం తీర్మానం పెట్టేందుకు వైసిపికి చెందిన కౌన్సిలర్లే సిద్ధమైనట్లు పట్టణంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మున్సిపల్ ఎన్నికల్లో కదిరి పట్టణంలో 36 వార్డులుండగా 31 వార్డుల్లో వైసిపి విజయం సాధించింది. దీంతో అప్పటి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ఆదేశాల మేరకు చైర్‌పర్సన్ పదవీ కాలాన్ని రెండున్నర సంవత్సరాలుగా విభజించి ఇద్దరికి అవకాశం కల్పించేలా తీర్మానం చేవారు. ఇందులో భాగంగా మొదటి విడతలో పరికి నజీమ్ మునిసాకు అవకాశం కల్పించారు. ఆ ఒప్పందం మేరకు రెండున్నరేళ్ల గడువు ముగిసింది. అయినా అప్పటి ఒప్పందం మేరకు చైర్‌పర్సన్ రాజీనామా చేయలేదు. ఒకానొక దశలో మున్సిపల్ కౌన్సిల్ మీట్ జరగకుండా ఆ పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లు అసమ్మతి వెల్లబుచ్చి విహారయాత్రకు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి పెద్దలు అసమ్మతి నేతలతో మాట్లాడి సమస్యను సద్దుమణిగించారు. ఎన్నికలు దగ్గర పడడంవతో వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్ధారెడ్డి కాదని కొత్త అభ్యర్థిని కదిరి నుంచి ఎన్నికల బరిలో నింపింది. ఆ అభ్యర్థి చైర్‌పర్సన్ సమీప బంధువు కావడంతో ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఏం చేయలేక పదవీ మార్పు వ్యవహారంపై చేతులెత్తేసారు. అనంతరం సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి బంపర్ మెజార్టీతో అధికారం చేపట్టింది. కదిరిలో కందికుంట వెంకటప్రసాద్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో వైసీపీలోని కొందరు కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. వైసిపి అధికారం కోల్పోయి టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో కొందరు వైసిపి కౌన్సిలర్లు ఇప్పటికే టిడిపిలో చేరేందుకు మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. పార్టీలో చేరేందుకు ఎమ్మెల్యే కందికుంట గ్రీన్ సిగ్నల్ కోసం వారంతా ఎదురు చూస్తున్నారు. కాగా చైర్‌పర్సన్ మార్పు జరిగితే టిడిపి ప్రతిపక్షంలో ఉండగా కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న వారికి ఆ పదవిని ఇవ్వాలనే చర్చ కూడా తెలుగుదేశం నేతల నుంచి విన్పిస్తోంది. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు గెలిచిన కౌన్సిలర్లు వైసిపి అధికారంలోకి రాగానే ఆ పార్టీలో చేరారు. వైసిపి గూటికి చేరిన అనంతరం మళ్లీ కౌన్సిలర్లుగా గెలుపొందారు. వైసీపీ అధికారం కోల్పోవడంతో వారంతా ఇప్పుడు సొంత పార్టీ పేరుతో మళ్లీ టిడిపిలోకి చేరేందుకు పావులు కదుపుతున్నారు. ఇక ఎన్నికల ముందు వైసిపికి చెందిన కొందరు కౌన్సిలర్లు చంద్రబాబు నాడు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఇలా సంఖ్యాపరంగా చూస్తే కౌన్సిల్‌లో టిడిపికి 11 మంది ఉండగా, వైసిపికి 25 మంది ఉన్నారు. వైసీపీకి చెందిన మెజార్టీ కౌన్సిలర్లు టిడిపిలోకి చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టి దింపేయడం ఖాయం అన్న భావన రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. అయితే ఇందుకు సంబంధించి మున్సిపల్ నిబంధనలు, చైర్‌పర్సన్ ఎంపిక తదితర వాటి లెక్కలను వేసుకుని ఆ తర్వాతనే ముందుకు వెళ్లాలనే భావనలో టిడిపి ఉన్నట్లు తెలుస్తోంది.

జరగని కౌన్సిల్ మీట్

మున్సిపాలిటీ నెలకొన్న సమస్యలపై చర్చించి పరిష్కరించాల్సిన కౌన్సిల్ మీట్ ఆ దిశగా అడుగులు వేయలేదన్న భావన ప్రజల్లో వ్యక్తం అవుతోంది. సమావేశం జరిగి మూడు నెలలు అయినా కౌన్సిల్ మీట్‌ను ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పట్టణంలో పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. దోమల అధికమై ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. మున్సిపాలిలో నీటి సమస్య కూడా నెలకొంది. ఇలాంటి ప్రజాసమస్యల పరిష్కారం కావాలంటే మున్సిపల్ సమావేశం జరగాల్సి ఉంది. మరి ఆదిశగా అధికారులు, పాలకవర్గం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నామినేటెడ్‌పై ఆశలు

◆ గ్రూపుల వారీగా జాబితాలు తయారీ
◆ తమకే ఇవ్వాలంటూ నేతల వద్ద విజ్ఞప్తులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెరిగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరలోనే నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని ప్రకటించడంతో ఆశావహుల్లో ఉత్సహం నెలకొంది. అప్పుడే పదవులు ఆశించే వారంతా తమతమ నాయకుల వద్దకు చేరుకుంటున్నారు. ఈసారైనా తప్పకుండా పదవులు లభించే విధంగా సిఫార్సు చేయాలని కోరుతున్నారు. ఈ ఐదేళ్లలో పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్‌లో అవకాశాలు కల్పించాలని ప్రజాప్రతినిధుల వద్దకు ఆశావహులు చేరకుంటున్నారు. తమకు కావాలంటే తమకంటూ పోటీపడుతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఇబ్బందులు పడ్డామని నేతల దృష్టికి తీసుకెళు తున్నారు. ఇటువంటి వారిని గుర్తించి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు.

గ్రూపుల వారీగా జాబితాలు

తెలుగుదేశం పార్టీలో అనేక చోట్ల గ్రూపులున్నాయి. ఎన్నికల సమయంలోనూ ఈ గ్రూపులు కొనసాగాయి. కలసి పనిచేయడంతో సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకి ఘన విజయం లభించింది. నామినేటెడ్ పదవులు వచ్చే సరికి ఈ గ్రూపులు మరోమారు యాక్టివ్ అయ్యాయి. తమ గ్రూపునకు సంబంధించిన వారికే నామినేటెడ్‌లో అవకాశాలు కల్పించే విధంగా చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో తమ వర్గాలను సిద్ధం చేసుకుంటున్నారు. అనంతపురం జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో నాలుగు నియోజకవర్గాల్లో పాత నేతలుండగా, కొత్త నేతలు ఇప్పుడు ప్రజాప్రతినిధులుగా అయ్యారు. పాత, కొత్త నేతల తమతమ అనుయాయులకు నామినేటెడ్ పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

వైసిపి తరహాలో భర్తీ చేసేరా ?

గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పదవులు పెద్దఎత్తునే జిల్లాకు వచ్చాయి. రాష్ట్ర స్థాయి పోస్టులు కూడా వచ్చాయి. అయితే అదే స్థాయిలో తెలుగుదేశం పార్టీ కూడా పదవులు ఇస్తుందా లేదా అన్న సందిగ్ధత తెలుగుదేశం శ్రేణుల్లోనూ నెలకొంది. ఎందుకంటే అంతకు మునుపు 2014 సమయంలో అనేక పోస్టులు భర్తీ చేయలేదన్న అంతృప్తి ఉంది. ఈసారి అందుకు భిన్నంగా నామినేటెడ్ పోస్టులను భర్తీని సంపూర్ణంగా చేపడతారన్న ఆశాభావం కూడా వ్యక్తమవుతోంది. ఇప్పటికే వైసిపి నామినేటెడ్ పోస్టుల్లోనున్న వారందరూ రాజీనామాలు చేశారు. ఈ ఖాళీ స్థానాలను త్వరలో భర్తీ చేయనున్నారు. వీటి కోసం తెలుగుదేశం నేతలు భారీగానే ఆశలు పెట్టుకున్నారు.



సీటు కోసం అధికారుల చక్కర్లు..!

◆ ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు
◆ కదిరికి వచ్చేందుకు ఎవరి ప్రయత్నాలు వారివి..

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం మారడంతో పాలనపరమైన విధానాలూ మారుతున్నాయి. ఇందులో ముఖ్యంగా అధికారుల స్థాన చలనం జరగనుంది. ఈ నేపథ్యంలో అధికారులు ఆయా స్థానాల్లో వచ్చేందుకు ప్రజాప్రతినిధుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ముఖ్యంగా కదిరి నియోజవకర్గంలోకి వచ్చేందుకు వివిధ శాఖలకు చెందిన చాలా మంది అధికారులు సిఫార్సు పత్రాలు పట్టుకుని ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో విధులు నిర్వహించిన అధికారులు వైసిపికి అనుకూలంగా పని చేశారనే భావన టిడిపి నేతల్లో ఉంది. అలాంటి అధికారులందిరనీ సాగనంపి వారి స్థానంలో కొత్త వారిని తెచ్చుకునేందుకు అధికార పార్టీ ముఖ్య నేతలు ప్రయత్నం చేస్తున్నారు. రెవెన్యూ, ఎంపీడీవో ఉపాధి హామీ, మున్సిపాల్టీ, పోలీసు తదితర ముఖ్య శాఖల్లో పాత అధికారులకు స్థాన చలనం తప్పదనే ప్రచారం నడుస్తోంది. కదిరిలో ఈ శాఖల్లోకి వచ్చే అధికారుల సంఖ్య కూడా ఎక్కువగానే కన్పిస్తోంది. తమకు ఎలాగైనా నియోజకవర్గంలో పోస్టింగ్ ఇప్పిస్తే అనుకూలంగా ఉంటామనే సంకేతాలను కూడా వారు ఇస్తున్నారు. తమకు పోస్టింగ్ ఇచ్చేలా లెటర్‌ప్యాడ్లతో అనుమతి పత్రం ఇవ్వాలంటూ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల వద్దకు క్యూ కడుతున్నారు. ఇక కదిరి విషయంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించే అధికారులకే తన మద్దతు ఉంటుంది అనేలా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇప్పటికే స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఇదే విషయాన్ని తన వద్దకు వస్తున్న అధికారులకు చెబుతున్నట్లు తెలుస్తోంది. కూటమి నాయకులు, కార్యకర్తలు మాత్రం గత ప్రభుత్వంలో పనిచేసిన ఏ ఒక్క అధికారి తమ నియోజవకర్గంలో వద్దనే వాదనను ముఖ్య ప్రజాప్రతినిధుల వద్ద వినిపిస్తున్నట్లు తెలుస్తోంది. కదిరి నియోజకవర్గ కేంద్రంలో ఉన్న సబ్ రిజిస్టర్ కార్యాలయంలో కొంతమంది అధికారులను మార్చాలని పట్టుబడుతున్నారు. వైసిపి ప్రభుత్వంలో అక్రమ రిజిస్ట్రేషన్లతో ప్రజలను ఇబ్బందికి గురి చేసిన అధికారులను ఇక్కడి నుంచి సాగనంపాలని ముఖ్య ప్రజాప్రతినిధి వద్ద కూటమి నాయకులు తెలియజేశారు. ఇలా దాదాపు అన్ని శాఖల్లోనూ అధికారుల మార్పుపై జోరుగానే చర్చసాగుతోంది. ఈ నేపథ్యంలో మరో నెల రోజుల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల మార్పు ఉండే అవకాశం మాత్రం స్పష్టంగా కన్పిస్తోంది.

'విద్యా కానుక' బూట్ల విక్రయాలపై విచారణ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో 'విద్యాకానుక' బూట్ల విక్రయాల ఘటనపై అధికారులు స్పందించారు. 'విద్యాకానుక ' బూట్ల విక్రయాల శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారిని మీనాక్షి, మధ్యాహ్న భోజన పథకం ఏడి రామకృష్ణ, సిఎంఒ అబ్దుల్ మాలిక్ మంగళవారం స్థానిక ఎంజిఎం పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో కొన్ని రికార్డులను పరిశీలించారు. గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి విద్యార్థుల కోసం ఎన్ని బూట్లు వచ్చాయి, అందులో ఎన్నివిద్యార్థులకు అందించారు, మిగిలిన బూట్ల వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి సరఫరా అయిన బూట్లలో పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందించలేదని రికార్డుల పరిశీలనలో తేలినట్లు సమాచారం. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి మాట్లాడుతూ ప్రజాశక్తి లో వచ్చిన కథనంపై సమగ్ర విచారణ చేపడుతున్నమన్నారు. రికార్డుల పరిశీలనలో విద్యా కానుక ద్వారా అందించిన బూట్లు పాఠశాల నుంచి విక్రయించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందన్నారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎమ్‌కు మెమో ఇచ్చామన్నారు. ఇచ్చిన మెమోకు హెచ్‌ఎం సకాలంలో సరైన సమాధానం ఇవ్వకుంటే సస్పెండ్ చేయడానికి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి అందించిన విద్యా సామాగ్రితో బూట్లు, సాక్స్ ఇతర విద్యాసామాగ్రి విక్రయిస్తేఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. వారిపై కఠిన చర్యలు చేపడుతామన్నారు. పాఠశాలల్లో అవసరంలేని వస్తువులు ఏవైనా ఉంటే విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ, పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులతో ఒక కమిటీ వేసి వారి నిర్ణయం మేరకు వాటిని విక్రయించి, దాని నుంచి వచ్చిన నగదును పాఠశాల ఖాతాలోకి జమ చేయాలన్నారు. నిబంధనలు పాటించకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇష్టానుసారంగా నిర్ణయాలను తీసుకొని వ్యవహరిస్తే విద్యాశాఖ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎంజిఎం పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డిఇఒ మీనాక్షి



కె.గణేష్ 3వ ర్యాంకు



శ్రీనాథ్ 32వ ర్యాంకు



జాహ్నవి 57వ ర్యాంకు

ఏపీ పీజీ ఈసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర స్థాయిలో జెఎన్‌టియు ఓటిపిఆర్ఐ విద్యార్థులకు ర్యాంకులు

ప్రజాశక్తి-అనంతపురం

ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఏపీ పీజీ ఈసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అనంతపురం జెఎన్‌టియు అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ పార్మసీ విద్యార్థుల అత్యంత ప్రతిభ చాటారు. రాష్ట్ర స్థాయిలో గణేష్ 3వ ర్యాంకు, చేకూరి శ్రీనాథ్ 32 ర్యాంకు, కె.జాహ్నవి 57వ ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా ఓటిపిఆర్ఐ డైరెక్టర్ ఆచార్య దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఓటీపీఆర్ఐ కళాశాల విద్యార్థులు అత్యున్నత ర్యాంకులు సాధించడం గర్వకరాణంగా ఉందన్నారు. రాష్ట్రస్థాయిలో తమ విద్యార్థులు 100 లోపు ముగ్గురు విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. వీరితో పాటు కె. అనిల్ కుమార్ 117, జె.మౌనిక184, పి.యస్వంత్ 211, కె.ఇమ్రాన్ 268, ఎ.విజ్ఞత 302, గంగాధర్ 525, టి.సల్మా 525, కె.శ్రావణి 525, ఎం.శ్రావణి 608, జి.లిఖిత 812, సి.తులసి 812 ర్యాంకులు సాధించారన్నారు. అత్యత్తమ ర్యాంకులు సాదించిన విద్యార్థులను జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య జివిఆర్.శ్రీనివాసరావు అభినందించారు.

హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం

జిల్లా కమిటీ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ



సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ

ప్రజాశక్తి-హిందూపురం

దళితులు వారి కేటాయించిన హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైనదని, ప్రతి దళితుడు హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించడానికి సిద్ధం కావాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు అత్యాచారాలు అధికమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రధాన కారణం దళితుల్లో ఐక్యత లేకపోవడమే అన్నారు. ఐక్య ఉద్యమాల కోసం ప్రతి దళితుడు కేవీపీఎస్‌లో చేరి దళిత వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమాలు చేపట్టాలన్నారు. త్వరలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో చలో దళితవాడ అనే కార్యక్రమాన్ని చేపట్టి గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. పూర్తిస్థాయిలో కమిటీలు ఏర్పాటు అయిన అనంతరం దళిత హక్కులకోసంఉద్యమాలు చేపడతామన్నారు. చర్మకారులకు 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు పెన్షన్ ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. దళితుల కోసం ప్రతి గ్రామంలో ప్రత్యేక శ్మశాన వాటిక, భూమి లేని నిరుపేదలకు భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, కొట్నూరు రాయుడు, నారాయణప్ప, రామానుజప్ప, రాజప్ప, మల్లయ్య, వెంకట రాముడు, జ్యోతమ్మ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోండి

సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్

ప్రజాశక్తి - పెనుకొండ టౌన్

బ్యాంకు, మున్సిపాలిటీకి సంబంధించిన కేసులను లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవాలని మండల న్యాయ సేవా అధికార సమితి అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ సూచించారు. మంగళవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులకు సంబంధించిన లోను కేసులు మున్సిపల్ శాఖకు సంబంధించి అధిక కేసులు ఉన్నాయని అన్నారు. సత్వర న్యాయం కోసం ఈనెల 29న నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి తెలిపారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి బుజ్జప్ప, ఎజిపి భాస్కర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవన్

కార్మికులకు ఉపయోగకరంగా కార్మిక, కర్షక భవనం : మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా విమానాశ్రయం ఎదురుగా సిపిఎం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కార్మిక కర్షక భవనం కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న భవన నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. గత సంవత్సరం నుండి చేపట్టిన పనులు, ఏ స్థాయిలో ఉన్నయో పరిశీలించి, పూర్తి అయిన పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొదటి ఫ్లోర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని సిపిఎం కార్యాలయ సిబ్బంది సిద్దు వివరించారు. ఈసందర్భంగా డాక్టర్ గేయానంద్ భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతూ ఇది కార్మిక కర్షక భవనమని ఈ భవనం ఎంతోమంది కార్మిక సంఘాల నాయకులకు, కార్మికులకు, రైతులకు, రైతు కూలీలకు ఉపయోగపడుతుందని అన్నారు. పేద, బడుగు జీవుల కోసం పనిచేసే పార్టీ సిపిఎం అని అన్నారు. అలాంటి పార్టీ జిల్లా కార్యాలయం ఏర్పాటుకు ఎంతోమంది పార్టీ అభిమానులు ,కార్యకర్తలు, నాయకులు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

తాడిపత్రి కౌన్సిల్ సమావేశంపై ఉత్కంఠ

నేడు మున్సిపల్ మీట్ - ఛైర్మన్ జెసి హాజరవుతారా.?

ప్రజాశక్తి-తాడిపత్రి



తాడపత్రి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఉత్కంఠ నెలకొంది. బుధవారం నాడు అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ రావు తెలిపారు. గత ఆరు మాసాలుగా కౌన్సిల్ సమావేశం నిర్వహించక పోవడంతో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు పట్టణంలో తిష్టవేశాయి. ఈ కౌన్సిల్ సమావేశం ద్వారా తాడపత్రిలో నెలకొన్న సమస్యలు ప్రస్తావనికొస్తాయనే చర్చ మొదలైంది. ఇదిలా ఉండగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి హాజరవుతారా.. కారా..? అనే అంశంపై పట్టణంలో పెద్ద చర్చ నడుస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఇరు పార్టీ నాయకులను జిల్లా పోలీసు యంత్రాంగం నియోజకవర్గ బహిష్కరణ చేసిన విషయం విధితమే. న్యాయశాఖ సైతం బహిష్కరణను సమ్మతిస్తూ జూన్ 28 వరకు ఇరు పార్టీ నాయకులను నియోజకవర్గంలోకి రావొద్దంటూ ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో సమస్యలకు తిష్ట వేసిన తాడిపత్రి మున్సిపాలిటీని గాడిన పెట్టేందుకు మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌కి హాజరవుతారనే చర్చ మొదలైంది. ఎన్నికల సమయంలో తలెత్తిన గొడవల కారణంగా కొంతమంది కౌన్సిలర్లు సైతం ఇప్పటికీ అజ్ఞాతంలో ఉన్నారు. ఈ క్రమంలో వైసిపికి చెందిన కౌన్సిలర్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరవుతారా లేదా అన్నది కూడా ఆసక్తికరంగా మారింది. నలుగురు వైసిపి కౌన్సిలర్లు ఎన్నికల ముందు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ కౌన్సిలర్లు హాజరు కాకపోయినప్పటికీ పట్టణంలోని ప్రధాన సమస్యలైన అండర్ డ్రైనేజీ, పారిశుధ్యం, పచ్చదనం సంరక్షణ, తాగునీరు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ వాటిని గాడిలో పెట్టేందుకు తీర్మానాలు చేసేలా ఛైర్మన్ ఆధ్వర్యంలో సమావేశంలో చర్చ నడుస్తుందనే భావన రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతోంది.

జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగవంతం

జేసీ అభిషేక్‌కుమార్



జేసీకి తమ సమస్యను వివరిస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జాతీయ రహదారి నిర్మాణం పనులు వేగవంతం చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బుక్కపట్నం మండలంలో2 ప్యాకేజీ కింద బుక్కపట్నం పట్టణంలో కొంత భూమి, పుట్టపర్తి మండలంలోని పుట్టపర్తి, ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి, కప్పల బండ, జగరాజు పల్లిత జరుగుతున్న పనులను ఆయన పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ భూనష్టపరిహారం తీసుకొనేందుకు రైతుల వద్ద గల ఆధారాలతో పాటు బ్యాంకు వివరాలు ఇవ్వాలని రైతులకు నోటీసు అందజేయాలని తెలిపారు. నష్ట పరిహారం అందని పలువురు రైతులు తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అర్హులకు వెంటనే నష్టపరిహారం అందజేస్తామని అన్నారు. రైతుల వద్ద ఉన్న భూ రికార్డుల మూలంగా తమకు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం ఒడిసి మండలంలోని గాజుకుంట్లపల్లి నందు జాతీయ రహదారుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

గ్రంథాలయాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం కొత్త చెరువులోనిశాఖా గ్రంథాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఆదివారం గ్రంథాలయంలో చోరీ జరిగిన నేపథ్యంలో ఆమె స్థానిక గ్రంథాయలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జయరాం, అటెండర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వహణపై ఆగ్రహం

హెచ్‌ఎమ్‌కు మెమో జారీ చేసిన డిఇఒ

ప్రజాశక్తి-హిందూపురం

ఎంజీఎం పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన నిర్వహణలో తలెత్తిన లోపాలపై డిఇఒ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలప్రధానోపాధ్యాయులు సామ్రాజ్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశ్వారు. డిఇఒ మీనాక్షి, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, సిఎంఒ అబ్దుల్ మాలిక్ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యహ్న భోజనాన్ని పరిశీలించారు. నిర్వాహకులు వండిన భోజనం అయిపోగా విద్యార్థులు భోజనం కోసం వస్తున్న దృశ్యాన్ని చూసి డిఇఒ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎందుకు భోజనం వండలేదని నిర్వాహకులను అడిగారు. పాఠశాల విద్యార్థుల హాజరుకు అనుగుణంగా భోజనం ఏర్పాటు చేస్తున్నారా, లేదా అన్న విషయాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల హెచ్ఎం సూచించిన మేరకు భోజనాలను సిద్ధం చేస్తున్నామని వారు సమాధాన మిచ్చారు. ప్రభుత్వం మెనూ మార్చి ఏడాది పూర్తి అయినప్పటికీ ఎందుకు ఇక్కడ మార్చలేదన్నారు. ప్రభుత్వం నూతన పాత్రలను సరఫరా చేసినప్పటికీ వాటిని ఎందుకు వినియోగించడం లేదని నిర్వాహకులకు ప్రశ్నించారు. ఇప్పటి వరకు నూతన పాత్రలు పాఠశాల హెచ్ఎం తమకు ఇవ్వలేదని, మెను మార్చిన విషయం సైతం తమకు చెప్పలేదని పాఠశాల హెచ్ఎం సూచనల మేరకు తాము వంట వండుతున్నామని నిర్వాహకులకు అధికారులు తెలిపారు. దీంతో పాఠశాల హెచ్ఎంపై డిఇఒ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పాఠశాలలో పనిచేస్తున్నది కాలక్షేపం కోసమా.... విద్యాభివృద్ధి కోసమా' అని ప్రశ్నించారు. వీటన్నింటి పైన వివరణ కోరుతూ హెచ్ఎం సామ్రాజ్యం కు మెమో జారీ చేశారు. దీంతోపాటు హెచ్ఎం వ్యవహారశైలిపై పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకోకుండా హెచ్ఎం వ్యవహరిస్తున్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. దీనిపై సైతం హెచ్ఎంకు మెమో ఇచ్చినట్లు తెలుస్తుంది. మొత్తం మూడు అంశాలపై పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం కు విడివిడిగా మెమో ఇచ్చి వివరణ కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతున్న డిఇఒ

జాతీయ రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్‌గా జిఎం.శేఖర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా జాతీయ రెడ్ క్రాస్ సంస్థ జిల్లా అధ్యక్షులుగా జిఎం. శేఖర్ మరోసారి ఎంపికయ్యారు. ఈయన గత మూడు సంవత్సరాల నుండి జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఛైర్మన్‌గా ఉన్నారు. ఆయన చేసిన సేవా కార్యక్రమాలు, తదితర అంశాలను పరిగణలోనికి తీసుకొని, మరోసారి జిల్లా ఛైర్మన్‌గా జిఎం. శేఖర్‌ను ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ఎంతో మంది పేద గ్రామీణ ప్రజలకు రెడ్ క్రాస్ సంస్థ ద్వారా లబ్ధి చేకూరిందని, బ్లడ్ డొనేటర్స్ ద్వారా రక్తాన్ని సేకరించి అత్యవసర పరిస్థితుల్లో ఆపరేషన్లకు అవసరమైన నిరుపేద ప్రజలకు అందించి ఎంతోమందికి ప్రాణదానం చేశామనితెలిపారు. ఈ రెడ్ క్రాస్ సంస్థ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తుందని విపత్తులు సంభవించినప్పుడు, అంటురోగాలు ప్రబలినప్పుడు ప్రజలకు సేవ చేయడానికి సంస్థ సన్నద్ధమై ఉందని తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్‌కు నాయకులు కొండమ రాజు, లాయర్ హరికృష్ణ, జ్యోతి ప్రసాద్, రామాంజనేయులు, మల్లికార్జున, డాక్టర్ రాఘవేంద్ర, భాస్కర్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



జిఎం. శేఖర్

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా హర్షకుమార్

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన హర్షకుమార్‌కు జిల్లా కమిటీలోకి స్థానం కల్పించినట్లు ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబావలి తెలిపారు. మంగళవారం మడకశిర కేంద్రంగా నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. విద్యార్థుల సమస్యలపై ఎప్పటికప్పుడు తనదైన శైలిలో స్పందించి పరిష్కరించడం ప్రభుత్వ హాస్టల్ లో పాఠశాలల్లో విద్యార్థులకు సరైన వసతుల కల్పనకోసం హర్షకుమార్ కృషి చేశారన్నారు. ఉద్యమస్ఫూర్తిని గుర్తించిన ఎస్‌ఎఫ్ఐ కమిటీ హర్షకుమార్‌ను జిల్లా సహాయక కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హర్షకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు పోరాటం చేస్తానని చెప్పారు.



హర్షకుమార్

విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన

ప్రజాశక్తి - కొత్తచెరువు

స్థానిక ఐకెపి కార్యాలయంలో మంగళవారం చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా బాలల సంరక్షణ సమితి, ప్రభాత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి కొండప్ప, పిఆర్డిఎస్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ సమితి ప్రొడక్షన్ అధికారి మహేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు మొబైల్ ఫోన్ కు దూరంగా ఉండి తమ పిల్లలను కూడా వాటికి దూరంగా ఉంచాలని సూచించారు. తల్లిదండ్రులు చేస్తున్న కష్టం గురించి తమ పిల్లలకు తెలియచెప్పాలన్నారు. సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. చదువుతోపాటు సంస్కారాన్ని నేర్పించాలన్నారు ఈ కార్యక్రమంలో ఎపిఎం రవీందర్ రెడ్డి, జిల్లా అధికారి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సిఎం, మంత్రి ఫొటోలు అందజేత

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత,టెక్స్టైల్స్ శాఖ మంత్రి సవితమ్మ ఫోటోలను తెలుగు యువత నాయకుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. తహశీల్దార్, ఎంపిడిఒ, వెలుగు, పోలీసుస్టేషన్ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాకులు ఎస్ఎస్. గోవింద్ రెడ్డి, బాలాజీ, నాగభూషణం, డిఎస్ఎల్ శ్రీనివాసులు, వడ్డెర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించని సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని పలు సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో పలువురు సచివాలయాల అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రొద్దం 3 సచివాలయంలో పని చేస్తున్న సచివాలయ సిబ్బంది మంగళవారం ఉదయం 10 :45 గంటలు అయినా విధులకు హాజరుకాలేదు. కార్యాలయంలో కేవలం పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ ఆసిసెంట్ మాత్రమే ఉన్నారు. సిబ్బంది గైర్హాజరుపై పంచాయతీ కార్యదర్శి వివరణ ఇచ్చారు. రెవిన్యూ సెక్రెటరీ ఇంకా హాజరు కాలేదని, సర్వేయర్ ఫీల్డ్‌పై వెళ్లారని, హార్టికల్ అసిస్టెంట్, ఎఎన్ఎం లీవ్‌లో ఉన్నారని చెప్పారు.

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు ఆయన సందర్భంగా కొత్త జిల్లాలకు ప్రభుత్వ భవనాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు అడపాల వేమనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన లో భాగంగా నూతనంగా ఏర్పడిన జిల్లాలకు ప్రభుత్వ భవనాలు కరువయ్యాయన్నారు. ప్రస్తుతం సత్యసాయి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలను భవనాలు లేవని అన్నారు. సత్యసాయి ట్రస్టు దయాదాక్షణంతో సుమారు వంద వరకు ప్రభుత్వ కార్యాలయాలు సమకూర్చారని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయం కూడా సత్యసాయి సంస్థకు చెందినది అన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యల పరిష్కారమే సిఐటియు ధ్యేయం

ప్రజాశక్తి - తనకల్లు

కార్మికుల సంక్షేమమే సిఐటియు ప్రధాన ధ్యేయమని సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు వేమన్న, ఉపాధ్యక్షులు జిఎల్. నరసింహులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని డంపింగ్ యార్డ్ వద్ద సిఐటియు మండల శాఖ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య మహాసభ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిఐటియు నిత్యం కార్మికుల పక్షాన పోరాటాలు చేస్తుందని అన్నారు. కొన్నిచోట్ల అంగన్వాడీ, ఆశా కార్యకర్తలపై రాజకీయ వేధింపులు జరుగుతున్నాయని వాటిని ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు కొన్ని సూచనలను చేశారు.కొత్త ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మున్సిపల్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జగన్మోహన్, సిపిఎం మండల కార్యదర్శి శివన్న, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం సిఐటియు మండల కమిటీని ఏర్పాటు చేశారు. సిఐటియు మండల కన్వీనర్‌గా ఒంటెద్దు వేమన్న, కో కన్వీనర్‌గా నరసింహారెడ్డిని ఎన్నుకున్నారు. వీరితో పాటు భాగ్యమ్మ నాగలక్ష్మి, కళావతి, మంజుల, రాజి, రమణ, నాగేంద్ర, కృష్ణప్ప, తదితరులతో కలిసి 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

చిత్రావతి నదిలో యథేచ్ఛగా ఇసుక తరలింపు

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణానికి సమీపాన ఉన్న చిత్రావతి నది పరివాహన ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తరలుతోంది. ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు

అంగన్వాడీల్లో బడిబాట

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

అంగన్వాడీ కేంద్రాల వల్ల కలిగే ఉపయోగాలను సిడిపిఒ వరలక్ష్మి వివరించారు. మండల పరిధి లోని అల్లాపల్లి సెక్టర్ పరిధిలోనిఅన్ని అంగన్వాడి కేంద్రాల వారు గౌరాపురం అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ బడిబాట పాట సంబరాలను మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సిడిపిఒ వరలక్ష్మి , సూపర్వైజర్ విజయ కుమారి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు షమీం, స్వర్ణ, సావిత్రమ్మ, సుకన్య, సునంద, వెంకట్ నర్సమ్మ, వసంతమ్మ, ఇందిరా, సుకన్య, మంజులా దేవి, ప్రమీల, కె. శ్యామలమ్మ, ఎం. శ్యామలమ్మ, గ్రామస్తులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

7న మాదిగల ఆత్మగౌరవ కవాతు

ప్రజాశక్తి - మడకశిర

ఎంఆర్‌పిఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జూలై 7 న వరంగల్ లో మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహిస్తున్నట్లు స్థానికనాయకులు గుండుమల భూతన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ద్వారానే మాదిగలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో సమన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఆయన కోరారు.

త్వరలో అన్న క్యాంటీన్ ఏర్పాటు

ప్రజాశక్తి - మడకశిర

పట్టణంలో ఎన్టీఆర్ అన్నా క్యాంటిన్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టిడిపి మడకశిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలో అన్నాక్యాంటిన్ ఏర్పాటు పనులను గుండుమల తిప్పేస్వామి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్‌ను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

సీజనల్ వ్యాధుల పట్ల తప్పక అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ రామ్ కుమార్ కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో డయేరియా అనే వ్యాధి ప్రబలుతోందని దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సాధ్యమైనంతవరకు ఇంటిలోని ఆహారాన్ని మాత్రమే తినేలా అలవాటు చేసుకోవాలని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందనిప్రజలు ముందస్తుగా జాగ్రత్తలు పాటించాలని, వైద్యుల సలహా సూచనలు పాటించాలని కోరారు. కుటుంబంలోని చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

చెన్నేకొత్తపల్లి : వాతావరణ మార్పుల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడాపురం ప్రభుత్వ యునాని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఖాదర్ అన్నారు. మంగళవారం స్థానిక దళితవాడలోని అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలను తొలగించుకోవాలని చెప్పారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే ఆలస్యం చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకుని వైద్య సేవలు పొందాలన్నారు.

గాండ్లపెంట : సీజనల్ వ్యాధులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఇఒఆర్‌డి సునీత మాట్లాడుతూ గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మదనమోహన్ నాయక్, రవికుమార్, భాషా, భవాని తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన అధికారులు



స్థానికులతో వివరాలు సేకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల కేంద్రంలో వివాదాస్పదంగా మారిన స్థలాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. గత 4 రోజుల నుండి చేనేత కార్మిక సంఘం సభ్యులు, రియల్ ఎస్టేట్ వ్యాపారి భూ కబ్జాదారుడుకు మధ్య వివాదాస్పదంగా మారిన ప్రభుత్వ స్థలాన్ని సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహశీల్దార్ శంకర్ పరిశీలించి క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. ఈసందర్భంగా డిటీ మాట్లాడుతూ ఇరువర్గాల రిపోర్టును, ప్రభుత్వ రెవెన్యూ రికార్డులను పరిశీలించి తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న , మండల కార్యదర్శి రంగప్ప , మండల కమిటీ సభ్యులు, వార్డు మెంబర్ వెంకటేశులు, లక్ష్మీనారాయణ, మాబు, కొండా వెంకటేశులు , చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణస్వామి , కల్లు గీత కార్మిక సంఘం మండల నాయకులు రామకృష్ణ , చేనేత కార్మిక సంఘం నాయకులు ఈడిగ నాగరాజు, గోవిందప్ప, జింక నాగరాజు , సిఐటియు మండల నాయకులు రవి , భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

పనుల వద్ద కనిపించని ప్రమాద సూచికలు

ప్రజాశక్తి -రొద్దం

మండలంలోని ఆర్. మరవపల్లి వద్ద నుంచి హిందూపురం వెళ్లే ప్రధాన రహదారి రెండు వరుసల రోడ్డులో కల్వర్టుల నిర్మాణ పనుల వద్ద ప్రమాద సూచికలు కన్పించడం లేదు. కల్వర్టుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా కల్వర్టులవెడల్పు, నూతన కల్వర్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ రహదారిలో ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో 8 కల్వర్టుల పనులు చేపడుతున్నారు. నిర్మాణ పనుల్లో భాగంగా దాదాపు 20 అడుగుల లోపలికి గుంతలు తీసి పనులు చేపడుతున్నారు. అయితే ఏ ఒక్క కల్వర్టు నిర్మాణ పనివద్ద కూడా ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళలో వచ్చే ద్విచక్ర వాహనాలు, పెద్ద పెద్ద వాహనాలు గాని అనుకోకుండా రోడ్డుపై వెళితే 20 అడుగుల గోతిలోకి పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక మునుపే ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పనిప్రదేశంలో కన్పించని ప్రమాద సూచిక బోర్డు

పంటలసాగుపై అవగాహన



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - లేపాక్షి

పంటల సాగు పద్ధతులు, సస్యరక్షణ గురించి మండలం వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏడిఏ సనావుల్లా, ఏవో అబ్దుల్ అలీ రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో పండించే పంటల యాజమాన్యం, సస్యరక్షణ గురించి అవగాహన కల్పించారు. పంట మార్పిడి వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. నానో యూరియా, నానో డిఏపి ప్రాముఖ్యతను తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు శ్రీలత, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : చిలమత్తూరు రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పంటసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మొక్క జొన్న,వేరుశనగ,కంది పంటల సాగు యాజమాన్య పద్ధతులపై జిల్లా వ్యవసాయ సంచాలకులు సనావుల్లా,అబ్దుల్ అలీ అవగాహన కల్పించారు. రైతు భరోసా కేంద్రం ద్వార పంపిణీ చేసే నానో డిఎపి, నానో యూరియా, డ్రోన్‌తో మందుల పిచికారి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ వంశీకృష్ణ, వ్యవసాయ శాఖ సిబ్బంది, మండల రైతులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : మండల పరిధిలోని కోడపగానిపల్లి, తిరుమల దేవరపల్లి, గ్రామాల పరిధిలోని రైతులు సాగు చేసిన వేరుశగన పంట పొలాలను శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. జాన్సన్, కోఆర్డినేటర్ కె రామసుబ్బయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వేరుశనగ పంట 15 రోజుల నుండి 50 రోజులు పంటగా ఉందనిఈ పంటలో రసం పీల్చే పురుగులు ఉన్నాయని వీటి నివారణకు మోనోకోటపాస్ పిచికారి చేయాలని సూచించారు. వేరుశనగ సాగు చేసే రైతులు కచ్చితంగా విత్తన శుద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి నటరాజు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు : మొక్కజొన్న పంటకు కత్తెరపురుగు ఆశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎడిఎ సత్యనారాయణ, ఎఒ భారతి సూచించారు. ఈ మేరకు వారు నల్లచెరువులోని పిచ్చుక ఆంజనేయులు అనే రైతు సాగు చేసిన మొక్కజొన్న పంటను మంగళవారం పరిశీలించారు. పంటకు కత్తెర పురుగు ఆశించడంతో అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. పురుగు నివారణ కోసం బెంజోయిట్ ఇతర పురుగు మందులు స్ప్రే చేయాలని సూచించారు.



ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందసభ్యుతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

గొల్లపల్లి రిజర్వాయర్‌లో ఎన్‌డిఆర్‌ఎఫ్ మాక్‌డ్రిల్


ప్రజాశక్తి - సోమందేపల్లి

గొల్లపల్లి రిజర్వాయర్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తులలో ప్రజలకు తక్షణ సాయం కొరకు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఎప్పుడూ ముందు ఉంటాయన్నారు. గతంలో ఈ బృందాలు చూపించిన ధైర్య సాహసాలు, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులు, ఎన్‌సిసి విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

ప్రజాశక్తి - మడకశిర

బాల్య వివాహాల నిర్మూలనకు కలసికట్టుగా పనిచేద్దామని అధికారులు అన్నారు. మండలం పరిధిలోని బులసముద్రం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్‌డిటి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లఘుచిత్రాల ద్వారా ప్రస్తుత సమాజంలో ఎదురైయ్యే సమస్యల్ని ఎలా ఎదుర్కోవాలన్న దానిపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన మడకశిర ప్రాజెక్ట్ మహిళా శిశు అభివృద్ధి పథక అధికారి నాగ మల్లేశ్వరి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహం చేయాలని చూస్తే బాల్య వివాహ నిరోధక చట్టం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్, ఉపాధ్యాయులు సత్యలక్ష్మి, హేమలత, సూపర్వైజర్ శంకరమ్మ, హెడ్ కానిస్టేబుల్ సత్యరాజు, అంగన్వాడీలు, చిన్నారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ